క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

జగ్గంపేట: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌ హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12 మందిని కోర్టుకు హాజరు పర్చగా పెద్దాపురం న్యాయస్థానం ఏడుగురికి రూ.10వేలు చొప్పున జరిమానాలు, ఐదుగురుకి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 13 మందికి ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున జరిమానాలు విధించినట్లు వివరించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి రత్నగిరి కొండపైకి వచ్చిన వైఎస్సార్‌ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వెంకటరమణ గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వెంకటరమణ స్వామివారి దర్శనానంతరం శుక్రవారం మధ్యాహ్నం దేవస్థానం ప్రాంగణంలో గుండెనొప్పితో పడిపోయాడు. దేవస్థానం ఆసుపత్రిలో అతడికి ప్రథమ చికిత్స చేసి అనంతరం 108లో తుని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని బంధువులకు సమాచారం అందివ్వడంతో వారు రమణ మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం


ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌ సీపీ మరింత బలోపేతమయ్యేందుకు గ్రామ కమిటీలు ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్‌ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కోఆర్డినేటర్‌ ముద్రగడ గిరిబాబు శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గ్రామ కమిటీలకు ఎంపిక చేసిన సభ్యుల మొదటి జాబితాను ఇటీవల పార్టీ కార్యాలయంలో విడుదల చేశామన్నారు. పూర్తిస్థాయిలో గ్రామ కమిటీలకు ఎంపికైన సభ్యుల జాబితా రావాల్సి ఉందని ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతుందని గిరిబాబు తెలిపారు.

వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి సూర్యకుమార్‌కు సన్మానం


ఏలేశ్వరంలో సూర్యకుమార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌ సీపీ శ్రేణులు

ఏలేశ్వరం: వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి సామంతుల సూర్యకుమార్‌ను పట్టణంలో శనివారం ఘనంగా సన్మానించారు. పార్టీ శ్రేణులు సూర్యకుమార్‌కు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్‌ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్‌ పైల విజయ్‌కుమార్, మున్సిపల్‌ కోఆప్షన్‌ సభ్యుడు వాగు బలరామ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఈ–సెట్‌లో సత్తాచాటిన విద్యార్థులు


స్టేట్‌ 5, 8 ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వైస్‌ చైర్మన్‌ సతీష్‌రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్‌ విద్యార్థులు ఏపీ ఈ–సెట్‌ 2025 పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారని వైస్‌ చైర్మన్‌ ఎన్‌ సతీష్‌రెడ్డి శనివారం తెలిపారు. తమ విద్యార్థులు స్టేట్‌ 5, 8 ర్యాంకులతో పాటు వందలోపు 41 ర్యాంకులను సాధించినట్టు తెలిపారు. స్టేట్‌ 5వ ర్యాంకు మద్దూరి వినయ్, చీకోలు అమృత 8వ ర్యాంకు కైవసం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌ ఎస్‌టీవీఎస్‌ కుమార్, డీన్‌ ఏవీ మాధవరావు, అసోసియేట్‌ డీన్‌ పి శ్రీనివాస్, తదితరులు ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: మరిడమ్మ గుడి సమీపంలో ఆర్‌ అండ్‌బీ రహదారిలో మోటారు సైకిల్‌పై నాటు సారా రవాణా చేస్తున్న ఎస్‌.పైడిపాలకు చెందిన లింగేటి దేవుడు పట్టుబడ్డాడని రౌతులపూడి ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం నాటు సారా అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు గ్రామ శివారున వాహన తనిఖీలు చేపడుతుండగా నిందితుడు సారాతో పట్టుబడ్డాడని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడుని రిమాండు కోసం తుని జ్యూడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ కోర్టుకు తరలిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, సూరిబాబు, ఉదయ్‌కిరణ్, రాఘవ పాల్గొన్నారు.

సాగు నీటి కోసం నిరీక్షణ

- వరదలకు కొట్టుకుపోయిన రామరాజు కట్టు గ్రోయిన్‌
- పట్టించుకోని ఇరిగేషన్‌ అధికారులు
- వెయ్యి ఎకరాలకు అందని సాగునీరు
- సాగు లేక నష్టపోతున్న రైతులు


వరదలకు కొట్టుకుపోయిన రామరాజు కట్టు గ్రోయిన్‌

కోటనందూరు: సాగునీటి వనరులపైనే పంటల సాగు ఆధారపడి ఉంటుంది. నేల స్వభావం, అందుబాటులో ఉన్న నీటి లభ్యత ఆధారంగా రైతులు ఏ రకమైన పంట సాగు చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. ఇండుగపల్లి రెవెన్యూ పరిధిలో దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. సారవంతమైన నేలలు, నీటి లభ్యత ఉన్నా పంట పొలాలకు జలాలను చేరవేసేందుకు ఉపయోగపడే రామరాజు కట్టు గ్రోయిన్‌తోపాటు పలు చోట్ల తాండవ రిజర్వాయర్‌ కింద అనేక గ్రోయిన్లు శిథిలమవడంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామరాజు కట్టు గ్రోయిన్‌ వరదలకు కొట్టుకుపోవడంతో దీనిపై ఆధారపడిన సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు రైతులు ఖరీఫ్‌ సాగుకు దూరమయ్యారు. ఇండుగపల్లి రెవెన్యూ పరిధిలోని రామరాజు కట్టు గ్రోయిన్‌ పూర్తిగా శిథిలమైంది. ఈ గ్రోయిన్‌ ద్వారా వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేది. పదేళ్ల క్రితం సంభవించిన వరదల ఉధృతికి ఈ గ్రోయిన్‌ కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఆయకట్టు భూములకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్‌ సీజన్‌ వచ్చిందంటే ఆకాశం, పాలకుల వైపు చూడాల్సిన దయనీయ పరిస్థితి రైతన్నలకు ఎదురవుతోంది. ఈ గ్రోయిన్‌ను పునర్నిర్మించాలని పాలకులు, అధికారులకు విన్నవించినా వారు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదు. ఇప్పటికైనా గ్రోయిన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆయకట్టు అవసరాలను సాగునీరు అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

వెదుళ్ల గెడ్డ, పిల్ల కాలువల నుంచి వచ్చే నీరు వృధా కాకుండా వడిసిపట్టి సాగునీరుగా మళ్లించేందుకు ఇండుగపల్లి శివారు పంట పొలాల మధ్య రామరాజు కట్టు గ్రోయిన్‌ను బ్రిటీష్‌ కాలంలో నిర్మించారు. ఈ గ్రోయిన్‌పై ఆధారపడి ఇండుగపల్లి, టీజే నగరం, తుని మండలం డీ పోలవరం గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. క్రమంగా శిథిలావస్థకు చేరుతున్న ఈ గ్రోయిన్‌ 2014లో సంభవించిన వరదల ఉధృతికి కట్టు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఈ గ్రోయిన్‌ కింద ఉన్న వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సమస్య తలెత్తింది. ఏటా ఖరీఫ్‌ ముందు రైతులు పాలకులు, ఇరిగేషన్‌ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి నెలకొంది.

మాజీ మంత్రి సహకారంతో

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో రైతులు స్థానిక నాయకుల ద్వారా సమస్యను మాజీ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రాజా తన సొంత నిధులు రూ. 5 లక్షలతో గ్రోయిన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేయించి నాలుగేళ్లు సాగునీరు అందించారు. రెండేళ్లగా గ్రోయిన్‌ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోకపోవడంతో భూములు బీడు వారుతున్నాయి. రెండేళ్లుగా ఆయకట్టు రైతులు ఖరీఫ్‌ సాగుకు దూరమయ్యారు. పంట భూములున్నా సాగు చేయలేని దయనీయ పరిస్థితులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట భూమి బీడు వారుతోంది



రామరాజు కట్టు కింద నాకు మూడెకరాల పంట భూమి ఉంది. కట్టు కొట్టుకుపోవడంతో నా పొలానికి సాగునీరు అందడం లేదు. నీరు లేక మూడేళ్లగా పొలంలో పంట సాగు చేయలేదు. సమస్య ఎవరికి చెప్పినా పరిష్కారం దొరకలేదు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు కట్టుకు శాశ్వత మరమ్మతులు చేయించి సాగునీరు అందించాలి.

– దారకొండ అచ్చియ్య, రైతు, ఇండుగపల్లి

రూ.5 లక్షలతో మరమ్మతులు



రామరాజు కట్టు శిథిలావస్థలో ఉందని మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు తెలియజేసినప్పుడు రూ.5 లక్షల సొంత నిధులతో రెండు పర్యాయాలు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. గత ప్రభుత్వంలో ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరు అందించాం. రెండేళ్లగా ఎవరూ పట్టించుకోకపోవడంతో సమస్య మరలా మొదటికొచ్చింది. అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి.

– కుంచే అచ్చిరాజు, వైఎస్సార్‌ సీపీ నాయకుడు, ఇండుగపల్లి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


తొండంగి మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

తొండంగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలంతా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ ఏ.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిషత్‌ కార్యాలయంలో వెలుగు వీఓఏలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం సూర్యఘర్, స్త్రీనిధి, బ్యాంక్‌ లింకేజీ, ఉమెన్‌ ఎంటర్‌ ప్రెన్యూర్‌ తదితర పథకాలు అందిస్తోందన్నారు. పథకాల రాయితీలను, సద్వినియోగంపై ఇచ్చిన మార్గదర్శకాలు, సూచనలపై అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్‌ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదిషనల్‌ పీడీ జిలాని, డీపీఎంలు, కేవశ, అనిల్, డీపీఎం బ్యాంకు లింకేజీ పద్మావతి, ఏపీఎం వై.సత్తిబాబు, ఏడీ ఎస్‌ విజయకుమార్, ఈఓపీఆర్డీ మార్కండేయరావు.మండల మహిళా సమాఖ్యా పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

లోవ ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత


లోవ ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న దేవస్థానం ఉద్యోగులు

తుని రూరల్‌: తలుపులమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తులకు పరిశుభ్ర వాతావరణం కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తున్నట్టు డిప్యూటీ కమిషనర్, లోవ కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు అన్నారు. శనివారం మండలంలో వివిధ గ్రామాల్లో ఎంపీడీఓ కె.సాయినవీన్, లోవ దేవస్థానంలో ఈఓ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోవ ప్రాంగణాన్ని, కార్యాలయాన్ని, ఆర్వో వాటర్‌ ప్లాంట్లను ఉద్యోగులు, వేద పండితుల, అర్చకులు శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛ భారత్‌ ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను దహనం చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ జి.మరిడియ్య, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా కృషి చేయాలని జగ్గంపేట ఎంపీడీఓ చంద్రశేఖర్‌ అన్నారు. జగ్గంపేటలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయం వద్ద పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఏపీఎం ప్రశాంతి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

చెత్త ఊడ్చిన అధికారులు

ప్రత్తిపాడు: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్తిపాడులో అధికారులు చీపుళ్లు చేతపట్టి గ్రామంలో చెత్త ఊడ్చారు. ఎంపీడీఓ ఎంవీఆర్‌ కుమార్‌బాబు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి వి రాజబాబు, ఈఓఆర్డీ కేవీవీఎస్‌ కాశీ విశ్వనాథం, ఏపీఎం వై.వెంకట్, మండల విద్యాశాఖాధికారి వి. రాజబాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలందించాలి

- మరుగుదొడ్ల మూసివేతపై కలెక్టర్‌ ఆగ్రహం
- ఆస్పత్రిలో సదుపాయాల కల్పనలో అలసత్వం వద్దు
- అధికారులకు కలెక్టర్‌ షణ్మోహన్‌


తుని ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు పోషకాహార ప్యాకెట్లను అందజేస్తున్న ఎంపీ, కలెక్టర్‌

తుని: పేదలకు వైద్య సేవలు అందించే ఏరియా ఆసుపత్రిలో మరుగు నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంపై కలెక్టర్‌ షణ్మోహన్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం తునిలో నిర్వహించారు. స్వచ్ఛ దివస్‌ కార్యక్రమం జోనల్‌ అధికారి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌ శ్రీనివాస్‌ హాజరయ్యారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను కలెక్టర్‌ పరిశీలించారు. గర్భిణుల వార్డులో మరుగుదొడ్లు మూసి ఉండటంపై ప్రశ్నించారు. మరుగుదొడ్లు మూసి వేయడం వలన ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు కలెక్టర్‌ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులున్నా ఎందుకు నిర్లక్ష్యం వహించారని మందలించారు. తక్షణమే మరుగు దొడ్లను రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ స్వప్నను ఆదేశించారు. క్లీన్‌ అండ్‌ గ్రీన్‌కు పెద్దపీట వేయాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వయో వృద్ధుల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిశు సంక్షేమశాఖ ద్వారా గర్భిణులు, బాలింతలకు బాల సంజీవిని కిట్లను పంపిణీ చేశారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. స్థానిక అన్నా క్యాంటీన్‌లో భోజనం నాణ్యతను పరిశీలించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ నార్ల భువన సుందరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహనాయక్, మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట్రావు, తహసీల్దార్‌ ప్రసాద్‌ పాల్గొన్నారు.

ఆసుపత్రి సమస్యలపై ఎంపీకి వినతిపత్రం

కాకినాడ ఎంపీగా గెలిచిన తర్వాత తొలి ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఎంపీ తంగెళ్ల ఉదయ్‌ శ్రీనివాస్‌కు పలు సమస్యలపై నియోజకవర్గం జనసేన సమన్వయ కర్త చోడిశెట్టి గణేష్‌ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో పేదలకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలను అందించాలని అధికారులకు ఎంపీ సూచించారు.

రాజమహేంద్రవరానికి నూతన బస్సు సర్వీసు


పాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీటీఓ శ్రీనివాసరావు

కిర్లంపూడి: రాజమండ్రికి నూతన ప్రభుత్వ బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలంటూ వచ్చిన ప్రతిపాదనపై కాకినాడ డీపీటీఓ శ్రీనివాసరావు శనివారం గోనేడ రోడ్డును పరిశీలించారు. పాలెంలోని గ్రామస్తులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడు నుంచి కిర్లంపూడి, రాజుపాలెం, తామరాడ, గోనేడ, రామవరం మీదుగా రాజమండ్రికి నూతన బస్సు సౌకర్యం కల్పించాలని తమ దృష్టికి పలువురు తీసుకువచ్చారని తెలిపారు. దీనిలో భాగంగా కిర్లంపూడి– రాజుపాలెం, గోనేడ–రామవరం రోడ్డును పరిశీలించామన్నారు. గోనేడ–రామవరం రోడ్డు నిర్మాణంలో ఉందని, పనులు పూర్తయిన తరువాత నూతన బస్సు సర్వీసు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ ఆలీం భాష, క్రాంతి చారిటబుల్‌ ట్రస్టు చైర్మన్‌ బొడ్డేటి అప్పారావు, పలువురు గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

పలువురికి ముదునూరి పరామర్శ


ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కృష్ణను పరామర్శిస్తున్న ముదునూరి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: వైఎస్సార్‌ సీపీ నరసాపురం పార్లమెంట్‌ నియోజకవర్గ పరిశీలకుడు, ఎంఎంఆర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం ప్రత్తిపాడులో పలువురిని పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న శరభవరానికి చెందిన ఉలుసు శివ తండ్రి కృష్ణను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రెడ్నం గోవిందు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. గోవిందు కుమారుడు మురళిని ఓదార్చారు. శరభవరం ఎంపీటీసీ అమరాధి కాశీ, మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు తదితరులున్నారు. ఇటీవల పాముకాటుకు గురైన మండలంలోని ఏలూరుకి చెందిన కంబాల వెంకన్నను ముదునూరి పలకరించి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. చినశంకర్లపూడి ఎంపీటీసీ పిల్లా చిన్న, వైఎస్సార్‌ సీపీ నాయకుడు దాడిశెట్టి చక్రధర్‌ తదితరులున్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకార సేవ


సత్యదేవుడు, అమ్మవారికి ప్రాకార సేవ నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం: సత్యదేవుని ప్రాకార సేవ రత్నగిరిపై ఆలయ ప్రాకారంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి, తిరుచ్చి వాహనంపై ఉంచి, అర్చకులు పూజలు చేశారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి ప్రాకార సేవ ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల ఘోష నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తుల రద్దీ

సత్యదేవుని ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించి పూజలు చేశారు. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. స్వామివారి దర్శనానంతరం భక్తులు సప్తగోకులంలో శ్రీకృష్ణుడికి, గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. వ్రతాలు 2 వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. ఆదివారం ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని టేకు రథంపై ఆలయ ప్రాకారంలో ఊరేగించనున్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం


వీరవరం గ్రంథాలయంలో మ్యూజికల్‌ ఛైర్‌ ఆడుతున్న విద్యార్థులు

కిర్లంపూడి: మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాలయ అధికారి వి. వెంకటేశ్వరరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వీరవరం శాఖ గ్రంథాలయంలో శనివారం పిల్లలకు నీతి కథలు, జనరల్‌ నాలెడ్జ్, సామెతలు చెప్పారు. అనంతరం లెమన్‌ స్పూన్, మ్యూజిక్‌ ఛైర్‌ ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం గ్రంథాలయాల్లో..

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలో లైబ్రేరియన్‌ కవి కొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో శిక్షణ విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రిటైర్డ్‌ అధ్యాపకుడు చెన్నాప్రగడ సత్యగాంధీ, పెన్షనర్స్‌ సంఘ అధ్యక్షుడు వాసా పుల్లయ్య విద్యార్థులకు పలు అంశాలు వివరించారు.

భూసార పరీక్షతో నేలకు రక్ష


మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

శంఖవరం: భూసార పరీక్షతో నేలను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని ఆరెంపూడిలో మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలను రైతులు తప్పనిసరిగా చేయించాలని తద్వారా నేలలోని వివిధ పోషకాల స్థాయి తెలుసుకుని లోపాలను తెలుసుకోవచ్చని వివరించారు. ఈ పరీక్షలతో పంటకు సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు వినియోగించి సాగు ఖర్చు తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మౌళి ప్రసాద్, వ్యవసాయ సహాయకుడు మణికంఠ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ


ఏలేశ్వరంలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: పహల్గామ్‌ దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌పై చేపట్టిన ఆపరేషన్‌ సిందూర్‌ విజయవంతమవడంతో త్రివిధ దళాలకు కృతజ్ఞతగా పట్టణంలో శనివారం తిరంగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బాలాజీచౌక్‌ వరకు ర్యాలీ కొనసాగించారు. తీవ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రాణాలకు తెగించి ఆపరేషన్‌ సిందూర్‌ పాల్గొన్న సైనికులకు దేశం రుణపడి ఉంటుందన్నారు. అనంతరం మాజీ సైనికులు గుమ్ములూరు యతేంద్ర, కె సుబ్బారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కూటమి నేతలు పాల్గొన్నారు.

వేసవికాలం... తస్మాత్‌ జాగ్రత్త


ప్రత్తిపాడు సీహెచ్‌సీలో వేసవి జాగ్రత్తపై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్‌ డాక్టర్‌ సౌమ్యామైఖేల్‌

రౌతులపూడి: ప్రస్తుత వాతావరణంలో ఎండ వేడిమికి గురై వడదెబ్బ తగలకుండా ప్రజలంతా పలు జాగ్రత్తలు పాటించాలని రౌతులపూడి సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవి అన్నారు. స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆసుపత్రి సిబ్బందితో కలసి ర్యాలీ చేపట్టారు. ఆసుపత్రి ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజలంతా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్వాగత్, రామ తులసి, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రత్తిపాడు: వేసవికాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్‌ డాక్టర్‌ బి సౌమ్యామైఖేల్‌ కోరారు. స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో శనివారం వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఎండలో బయటకు రాకూడదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌ బి.సౌమ్యమైఖేల్‌ తెలిపారు. సీహెచ్‌సీ వైద్యులు, నర్సులు, సిబ్బంది గొడుగులు ధరించి, ఆసుపత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు.

అన్నదానానికి వినియోగించే దినుసుల శాంపిళ్ల సేకరణ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకటసత్యనారాయణ స్వామి దేవస్థానంలో అన్నదాన విభాగానికి కాంట్రాక్టర్లు సరఫరా చేసిన పది రకాల దినుసుల శాంపిళ్లను ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తనిఖీ నిమిత్తం తీసుకుని వెళ్లినట్టు దేవస్థానం అధికారులు శనివారం తెలిపారు. ఆరు నెలలుగా దేవస్థానానికి సరఫరా అయిన దినుసులను ఈ విధంగా తనిఖీ చేసి అవి నాణ్యతగా ఉంటేనే ప్రసాద తయారీ, అన్నదానంలో ఉపయోగిస్తున్నారని వారు తెలిపారు.

మల్లిసాలలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి

జగ్గంపేట: నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి మినీ మహానాడులో 24 తీర్మానాలు చేసినట్లు జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్‌ జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడులో ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట మండలం మల్లిసాలలో 500 ఎకరాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించేలా కడపలో నిర్వహించే టీడీపీ జాతీయ మహానాడులో తీర్మానం చేయిస్తామని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ఎస్‌.వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.